విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

చంద్రబాబు అంటేనే మోసం

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్పైసెస్ పార్కులో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి రజిని

విశాలాంధ్ర-చిలకలూరిపేట రూరల్ : చంద్రబాబు అంటేనే మోసం అని, ఈ రాష్ట్ర ప్రజలు ఇంకెప్పటికీ ఆయన్ను నమ్మరని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యడ్లపాడు మండలం మైదవోలు, వంకాయలపాడు గ్రామాల పరిధిలో ఉన్న స్పైసెస్ పార్కుకు విచ్చేస్తున్న నేపథ్యంలో మంత్రి విడదల రజిని బుధవారం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రూ.250 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐటీసీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి విడదల రజినితోపాటు కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్ ఇతరఉన్నతాధి కారులు ఉన్నారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ప్రాంతం, స్పైసెస్ పార్కులో పర్యటించే ప్రాంతాలు, సభాస్థలి ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

భారీ ఏర్పాట్లు:

ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని స్పైసెస్ పార్కు వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి విడదల రజిని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలుత స్పైసెస్ పార్కు చేరుకుంటారని తెలిపారు. అక్కడే ఐటీసీ నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. సభావేదికకు చేరుకుని ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరులో జరిగే మైనారిటీస్ వెల్ఫేర్ డే వేడుకలకు హాజరవుతారని తెలిపారు. అనంతరం గుంటూరు మెడికల్ కళాశాలలో 75 వసంతాల పైలాన్‌ను ఆవిష్కరిస్తారని చెప్పారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎక్కడా ఎవరికీ ఏ అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధి కారులకు ఆదేశాలు జారీ చేశారు.

జగనన్నకు ప్రజలతోనే పొత్తు:

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతి రోజూ ప్రభుత్వంపై బురదచల్లుతూనే ఉన్నారని మంత్రి విడదల రజిని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేశారని, మళ్లీ మోసం చేయడానికే ఆయన ప్రజల ముందుకు వస్తున్నారని మండి పడ్డారు. ప్రజలకు అన్నీ తెలుసని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్ట డానికి దుష్టచతుష్టయం విపరీతంగా తాపత్ర యపడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగనన్న ముందు వీరి ఆటలు సాగబోవని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు పచ్చ మీడియాను నమ్ము కుంటే జగనన్న తాను అందిస్తున్న సుపరిపాలనను మాత్రమే నమ్ముకున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు ఇతర పార్టీలు పొత్తుల కోసం ఆరాటపడుతున్నారని, కానీ తమ నాయకుడు జగనన్న నేరుగా ప్రజలతోనే పొత్తు పెట్టుకుంటారని పేర్కొన్నారు. తమకు ప్రజలతోనే పొత్తు అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

– నగర కమిషనర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరంలో ఈ నెల 11న జరిగే ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టాల్సిన పనుల పర్యవేక్షణకు నగరపాలక సంస్థ నుంచి అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించామని నగర కమిషనరు కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం కమిషనరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్, నగరంపాలెం జంక్షన్, మెడికల్ కాలేజి రోడ్, మూడు బొమ్మల సెంటర్‌లో జంక్షన్ అభివృద్ధి పనులు, పెరేడ్ గ్రౌండ్ నుంచి రమేష్ హాస్పిటల్ వరకు జరుగుతున్న డివైడర్ పెయింటింగ్, శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేజి, సీటింగ్, లైటింగ్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 11న మైనారిటీల సంక్షేమ దినోత్సవం సందర్భం గా గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్ర మంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనున్నారని, ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టాల్సిన పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాదిపతులను, డిప్యూటీ కమిషనర్లను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా నియమించామన్నారు. డివైడర్ పెయింటింగ్ పనులు మందకొడిగా జరగడం గమనించి, ఎక్కువ టీంలను ఏర్పాటు చేసుకొని, బుధవారం రాత్రికి పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు ఇప్పటికే ప్రత్యేకంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు విధులు కేటాయించామని, అందుకు తగిన విధంగా కార్మికులతో గ్యాంగ్ వర్క్ ద్వారా రోడ్ల స్వీపింగ్, బ్రషింగ్, క్లీనింగ్, హై బర్మ్ తొలగింపు పనులు వేగంగా జరిగేలా ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో లైటింగ్, పెయింటింగ్, సీలింగ్, స్టేజి, సౌండ్ సిస్టం ఏర్పాటు, ఫుడ్ కౌంటర్స్ పనులు వేగంగా జరిగేలా ఇంజి నీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. స్టేజి మీద ఎయిర్ కండిషనర్లు, జనరేటర్లు ఏర్పాటు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సీపీడీసీఎల్ ఈఈని ఆదేశించారు. హెలిప్యాడ్, విజ్ఞాన మందిరంలో, పార్కింగ్ ప్రదేశంలో మొబైల్ టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం చుట్టుపక్కల అనధికార హోర్డింగ్స్, బోర్డులు, చెట్ల కొమ్మలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను, డివైడర్ మీద గ్రీనరీ ఏర్పాటు చేయాలని ఏడీహెచ్‌సీ ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఆర్‌డీఓ ప్రభాకర రెడ్డి, ఎస్‌ఈ భాస్కర్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏడీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జంగాలకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ జంగాల అజయ్ కుమార్‌కు ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలియజేసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జోసఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహన్ రావు, చంద నరసింహా రావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, రాష్ట్ర కౌన్సిలర్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ షేక్ బాజీ తదితరులు ఉన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ఆర్కే

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి 12వ సచివా లయ పరిధి రత్నాల చెరువు బైపాస్ రోడ్‌లోని కొండపనేని అపార్ట్‌మెంట్ల వద్ద నుంచి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రత్నాల చెరువు బైపాస్ రోడ్‌లోని అపార్ట్మెంట్లలో ఎమ్మెల్యే ఆర్కే పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ మూడు ఏళ్ల నుంచి అందిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, త్రాగునీరు, మురుగునీటి సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపైన ఎమ్మెల్యే స్పందిస్తూ ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లు పిలవడం జరిగిందని, త్రాగునీరు సమస్యను పరిష్కరించి, సీసీ డ్రైన్ నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివ ప్రసాద్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన కళ్ళం వెంకట శివ ప్రసాద్ రెడ్డి భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం పెనుమాకలోని అతని స్వగృహంలో ఎమ్మెల్యే ఆర్కే సందర్శించి నివాళు లర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీను నాయక్ మృతి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు ప్రభుత్వ ఆసు పత్రిలో ఫారెన్సీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శీను నాయక్(46) బుధవారం తెల్లవారు జామున గోరంట్లలోని తమ స్వగృహంలో మృతి చెందారు. రేపల్లె ప్రాంతానికి చెందిన డాక్టర్ శ్రీను నాయక్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారిగా పనిచేశారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉన్న డాక్టర్ నాయక్ ప్రతి ఏటా అయ్యప్ప స్వామి మాల ధరిస్తుంటారు. వీరి సతీమణి పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డాక్టర్ నాయక్ మృతి పట్ల పలువురు డాక్టర్లు, పట్టణ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు

విశాలాంధ్ర-తెనాలి : అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నివేశన స్థలాలు అందజేయడం జరిగిం దని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జగనన్న కాలనీ ఇళ్ళ నిర్మాణాలపై సమీక్షలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఆయా లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలపై నాలుగు రోజులుగా ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తూ అధికారులు, కాంట్రాక్టర్లకు పలు ఆదేశాలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాల విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించవద్దని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నిర్మాణాల్లో ఎక్కడా లోపం జరగడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా తెనాలి పట్టణంలో దాదాపు 28వేల మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చామని చెప్పారు. వారందరికి ఇళ్ళు కట్టించి ఇవ్వాలన్నది సిఎం జగన్ ఆకాంక్షగా చెప్పారు. వర్షాల కారణంగా నిర్మాణాలు కొంత ఆలస్యమయ్యాయని అన్నారు. నవంబర్ నుండి ఎనిమిది నెలల వ్యవధిలో అన్ని లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు మేజర్ పార్ట్ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కమిషనర్ ఎం.జస్వంతరావు, హౌసింగ్ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కవి కుల గురువు 'మహాకవి కాళిదాసు'

విశాలాంధ్ర-గుంటూరు : సంస్కృత సాహిత్య వినీలాకాశంలో ధృవతారగా వెలిగిన మహాకవి కాళిదాసు కవి కుల గురువుగా విఖ్యాతి నార్జించారని ప్రముఖ సాహితీవేత్త రచయిత్రి డాక్టర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక హిందూ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ సంస్కృత కవి దిగ్గజం మహాకవి కాళిదాసు జయంతి బుధవారం ఘనంగా జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతంలో కాళిదాసు రచించిన కావ్యాలలో రఘువంశము, కుమార సంభవము, నాటకాలలో అభిజ్ఞాన శకుంతలము ప్రఖ్యాతి గాంచాయని చెప్పారు. కాళిదాసు తన రచనలలో ఉపమాలంకార ప్రయోగములు చేయటంలో సిద్ధహస్తులని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు డాక్టర్ ఆలూరి నటరాజకుమారి, మతుకుమల్లి తపతీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటంలో రెండో వైఎస్సార్ విగ్రహం తొలగింపు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇప్పటంలో రోడ్డు విస్తరణ అభివృద్ధిలో భాగంగా రెండో వైఎస్సార్ విగ్రహం స్వచ్ఛందంగా బుధవారం తొలగించడం జరిగిందని వైసీపీ తాడేపల్లి మండల యువ జన విభాగ అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి అన్నారు. రోడ్ల విస్తరణకు వైఎస్ రాజశేఖరరెడ్డి, విగ్రహమా.. ఎన్టీఆర్ విగ్రహమా.. అనేది కాదని అవసరమైతే గ్రామంలోని ప్రజలందరం కూర్చొని మాట్లాడుకుని దేవాలయాలను కూడా స్వచ్ఛందంగా తొలగించుకుంటామన్నారు. ప్రత్యామ్నాయంగా మరో స్థలంలో ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. అంతే గానీ ఎవరికో భయపడి తొలగించడం లేదని స్పష్టం చేశారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-గుంటూరు : స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా గుంటూరు నగరంలో వివిధ కేటగిరీల్లో స్వచ్ఛత అవార్డ్‌లు ఇవ్వనున్నామని, స్వచ్ఛ గుంటూరు కోసం నగరపాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో స్వచ్ఛతను పాటించడంలో ఆదర్శంగా నిలిచిన స్కూల్స్, హాస్పిటల్స్, హోటల్స్, మార్కెట్స్, నివాసాలు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, నగర ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా స్వచ్ఛతా అవార్డ్‌లు అందించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 10 నుంచి 16 వరకు ఆన్‌లైన్ ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ వెబ్‌సైట్ https://gunturcorporation.in/లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి ప్రైజ్ రూ.5 వేలు, రెండవ ప్రైజ్ రూ.3 వేలు, మూడవ ప్రైజ్ రూ.2 వేలతో పాటుగా ప్రశంసా పత్రాలు కూడా అందిస్తామని తెలిపారు. వివరాలకు 93460 42251, 98499 07277 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా న్యాయ సేవా దినోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు : లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చునని పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సత్య కుమారి పేర్కొన్నారు. న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సివిల్ కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్య కుమారి మాట్లాడుతూ కక్షిదారులు సత్వర న్యాయం పొందేందుకు న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. తద్వారా సమయం, శ్రమ, డబ్బు వృధా కాకుండా సత్వర న్యాయాన్ని పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల విజయమాధవి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు : సమాజంలోని పేదలు, వృద్ధులు, అంధ బాలబాలికలకు వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల విజయమాధవి అందిస్తున్న సేవలు అభినందనీయమని సోషల్ వెల్ఫేర్ బోర్డ్ రాష్ట్ర డైరెక్టర్, నగర మహిళా అధ్యక్షురాలు గనిక ఝాన్సీరాణి, 32వ డివిజన్ వైసీపీ ప్రెసిడెంట్ వెలుగూరి రత్న ప్రసాద్ కొనియాడారు. స్థానిక బ్రాడీపేటలోని షిర్డీ సాయి అంధుల ఆశ్రమంలో వైఎస్ భారతి మహిళా మండలి అధ్యక్షురాలు, మెగాస్టార్ చిరంజీవి రాంచరణ్ ఉపాసన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల విజయమాధవి ఆధ్వర్యంలో బుధవారం పేద మహిళలకు చీరలు, అంధ బాలబాలికలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర మహిళా ప్రధాన కార్యదర్శి మల్లెల సత్యవతి, నాయకులు చుండూరు వెంకట రమణ, మహేంద్ర గులేశా, ఈదా విజయలక్ష్మి రెడ్డి, లక్ష్మీగుప్త, సోషల్ మీడియా గుంటూరు వెస్ట్ కన్వీనర్ కేతావత్ రవీంద్ర నాయక్, ప్రముఖ టీవీ చానెల్ డైరెక్టర్ షేక్ ఖాసిమ్, పండ్ల వ్యాపారి షేక్ జిలాని, సంజీవ్‌నగర్ ప్రముఖ సంఘ సేవకుడు దాసరి వేణు, మండవ వెంగమ్మ, షేక్ రేష్మి లక్ష్మీ, షేక్ నాగుల మీరాబాబు, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, నవమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 21ను రద్దు చేయాలి: సీపీఐ, ఏఐటీయూసీ

విశాలాంధ్ర- పెదకూరపాడు రూరల్ : ఆటోలు మోటార్ వాహనాలపై భారీగా జరిమానాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21న రద్దు చేయాలని ఏపీ ఆటో వర్కర్స్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అన్నారు. అచ్చంపేట మండల కేంద్రమైన ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను పంపిణీ చేసి ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో, మోటార్ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న పోలీసు ఈ చలానాలు రద్దు చేయాలని అలాగని రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గోతులపై రోడ్లను వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని శ్రీనివాసరావు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ డీజిల్, పెట్రోలు, వంటగ్యాస్, విద్యుత్ ఇంటి పన్ను, చెత్త పన్నులను రద్దు చేసి ఆటో కార్మికుల కుటుంబం సభ్యులకు జీవనోపాధి కల్పించాలని, ఆటో, మోటార్ వాహనాలపై పెంచిన గ్రీన్ టాక్స్ రోడ్డు టాక్స్ టోల్ ప్లాజా ఫీజులు రద్దుచేసి సీఎన్‌జీ గ్యాస్ ధరలు నియంత్రించాలని శ్రీనివాసరావు డిమాండ్ చూశారు. ఈనెల 10వ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కారక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటర్ నాయకులు కూరాకుల రాంప్రసాద్, సీనియర్ సీపీఐ సీనియర్ నాయకులు చిన్న, నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సభ్యులు పొన్న కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు సంపంగుల ఏడుకొండలు, అశోక్, ఆటో వర్కర్స్ సీనియర్ నాయకులు ప్రసాద్, ఎస్‌కే బాజి, స్వామి, రామాంజనేయులు, నూకారావు, వెంకటశివరావు, బి.ప్రసాదు, పాండు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

13న 'ఆకురాలిన చప్పుడు' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు లక్ష్మీపురంలోని ఏపీ కాటన్ అసోసియేషన్ మీటింగ్ హాలులో యువకవి వశిష్ట సోమేపల్లి తొలి కవితా సంపుటి 'ఆకురాలిన చప్పుడు' ఆవిష్కరణ సభ జరుగుతుందని గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ కవి, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ గావిస్తారని తెలిపారు. జరుబుల సౌభాగ్యమ్మ కవితా సంపుటిని స్వీకరిస్తారని, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ప్రముఖ కవులు అనిల్ డ్యాని, మందరపు హైమావతి వక్తలుగా పాల్గొని పుస్తక సమీక్ష చేస్తారని వివరించారు.

టీడీపీకి బీసీలే వెన్నుముక

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముక లాంటి వారని టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా బీసీ సెల్ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా నగర పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్, జిల్లా బీసీ విభాగం పరిశీలకులు అడకా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావానికి ముందు బీసీలకు గుర్తింపు లేదని, బీసీలను ఆదరించింది, వారి సాధికారత కోసం కృషి చేసింది తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. అనేకమంది బీసీలను ఎమ్మెల్యేలుగా గెలిపించిన ఘనత టీడీపీదేనని అన్నారు. అదేవిధంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. బీసీలందరూ సమిష్టిగా కృషి చేసి రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలుకా వీరాంజనేయులు, తుమ్మేటి మురళి, చాగంటి పూర్ణచంద్రరావు, గిరి గణేష్, కారంపూడి అంకమ్మరావు, మాదాల చిన్నకొండలరావు, వంగర ఏడుకొండలు, గట్టి శ్రీనివాసరావు, రాచకొండ లక్ష్మయ్య, నల్లబోయిన నాగేశ్వరరావు, ఆరుద్ర సదాశివరావు, ఢిల్లీ రామారావు, వేల్పుల అంకారావు, ఒగిబోయిన శివన్నారాయణ, మునగ గణపతి, కొల్లిపర శ్రీనివాసరావు, బంధనాధం సతీష్, సంగవరపు చంద్రశేఖర్, చికుల వెంకటేశ్వరరావు, గుడికి సాంబయ్య, రాయపూడి శ్రీనివాసరావు, బత్తుల నాగరత్నం, సూరె శ్రీనివాసరావు, ఈగ వీరయ్య, నీలాల కృష్ణారావు, యలవర్తి పాపచర్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంచటం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి

విశాలాంధ్ర-పొన్నూరు : మండల పరిధిలోని ఆరమండ, మన్నవ గ్రామాలలో బుధవారం జరిగిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు ఎంపీడీవో బి.శేషమాంబ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పశుసంపద ద్వారా పాల ఉత్పత్తిని వృద్ధి చేయడం ద్వారా మహిళఆర్థికంగా పురోభివృద్ధి కావచ్చునని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలు దీనిపై దృష్టి సారించాలని తద్వారా మహిళా సాధికారిక సాధించవచ్చు అని ఆమె పేర్కొన్నారు. భవనం పద్మలీల, గ్రామ సర్పంచి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పాలవెల్లువ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు, అధికారులు పాల్గొన్నారు.

14న ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలో పాల్గొనండి

విశాలాంధ్ర-తెనాలి : వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఈనెల 14న జరిగే ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం 3వ జిల్లా మహాసభలో పాల్గొనాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. బుధవారం మండల గ్రామాలైన గుడివాడ, కోపల్లె, అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాలలో శివసాంబిరెడ్డి కౌలు రైతులతో సమావేశాలు నిర్వహించారు. 2011 చట్టం స్థానంలో 2019 చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చినా గానీ కౌలు రైతులకు ఆశించిన ప్రయోజనాలు దక్కడం లేదని చెప్పారు. కౌలు కార్డులు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, నష్టపరిహారాలు తదితర సమస్యలపై జిల్లా మహాసభ సవివరంగా చర్చించి ప్రభుత్వానికి సూచనలు, తీర్మానాలు అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశాలలో బండి సుధాకర్, భాస్కరరావు, బేతాళదావీదు, కర్రి వరదయ్య, నవాబ్ తులసీ నాయక్, రాయపాటి జగజ్జీవన్‌రాం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలతో మోసపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల పరిధిలోని తాళ్ళచెరువు గ్రామంలో గంగా కావేరి సీడ్స్ పత్తి విత్తనాలతో 500 ఎకరాలు రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారని వెంటనే కంపెనీ ప్రభుత్వం ఆదుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాడు శ్రీధర్ అన్నారు. బుధవారం తాళ్లచెరువులో పత్తి రైతులతో కలసి పత్తి చేనును పరిశీలించారు. శ్రీధర్ మాట్లాడుతూ మూలగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా అతివృష్టి అనావృష్టితో రైతులు నష్టపోతున్నారని తక్షణమే గంగ కావేరి పత్తి విత్తనాల కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు టీడీపీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగామ ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, రాష్ట్ర టీడీపీ కార్యాలయ కార్యదర్శి ఎన్నా సాంబశివారెడ్డి, మొక్కపాటి గిరిబాబు, కాసులు దెబ్బయ్య, రవి, శివరాత్రి పెద్ద శీను, వెంకయ్య, రైతులు ఎన్నారెడ్డి, రాజారెడ్డి, జ్యోతి రెడ్డి, మర్రెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

EP.100/2020,OS.291/2015.

బిట్వీన్ :

చొక్కా రోశయ్య – D.H.R

వర్సెస్

గోళ్ళ శ్రీనువాసరావు – J.D.R

టు,

గోళ్ళ శ్రీనువాసరావు తండ్రి సత్యనారాయణ, C/o. సుంకర రామారావు వాటర్ ప్లాంట్, రామాలయం మరియు ఇందిరాగాంధీ విగ్రహం మధ్య, 7వ లైను శ్రీనివాసరావుపేట గుంటూరు.

పై J.D.R అయిన నీవు ఆర్డర్ 21, రూల్ 66, CPC నోటీసుకు గాను ది.25/11/2022న ఉదయం 10.30 గంటలకు స్వయం గాను లేదా అడ్వకేట్ ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలియ జేయని ఎడల నీ పరోక్షమందు తీర్మానింపబడునని తెలియజేయుటమైనది.

వాయిదా ది. 25/11/2022.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గట్ల సత్యనారాయణరెడ్డి,
న్యాయవాది, మాచర్ల.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-దుర్గి : చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు సీనియర్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. మండల కేంద్రమైన దుర్గిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మాచర్ల జాతీయ న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ న్యాయం సేవా దినోత్సవ కార్యక్రమము నిర్వహించారు. చట్టాలు, హక్కులు, విధులు, రాజ్యాంగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు షేక్ గౌస్ పాష, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-నరసరావుపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధి లక్ష్యంగా నాడు-నేడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని జొన్నలగడ్డ హైస్కూల్లో రూ.84 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఏడు తరగతులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జొన్నలగడ్డ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.1.77 కోట్ల నిధులను కేటాయించామన్నారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పూర్తి అయితే 400 మంది విద్యార్థులు చదువుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అర్హులైతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-నూజెండ్ల : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ముప్ప రాజు వారిపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' రెండవ రోజు నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా ఎంత లబ్ధి పొందారని వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలకు జరిగిన లబ్ధి కలిగిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిడమానూరి మాధవి శ్రీనివాసరావు, ఎంపీపీ మేడమ్ జయరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు జడ్డా సుబ్బులు రామయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ జిలాని భాష, తహశీల్దారు జెట్టి మధుబాబు, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, వైసీపీ నాయకులు ముప్పరాజు వెంకటేశ్వర్లు, కంచర్ల బాబు, పరిమి శేషు, గంధం బాలిరెడ్డి, జక్కి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రెంటచింతల : రెంటచింతల మండలం తుమ్మకోటలో బుధవారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. స్థానిక పోలీసులు తెలిపిన ఘటనా వివరాలిలా ఉన్నాయి. మాచర్ల నుంచి తుమ్మకోటకు వస్తున్న ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న పొట్టిపోగు ముత్యాలమ్మ(61) మృతి చెందింది. మిగిలిన ఏడుగ్గురికి స్వల్ప గాయాలైనాయి. ముత్యాలమ్మ భర్త పోలేషు గతంలోనే చనిపోయాడు. ఒక్క కుమార్తె జయలక్ష్మిని కల్గిఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై హనుమంతరావు తెలిపారు.

ప్రజల చెంతకే సంక్షేమ ఫలాలు

విశాలాంధ్ర-దుర్గి : ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలు ప్రవేశపెట్టి వాటి ఫలాలను ప్రజల చెంతకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా అభివృద్ధి మండలి ఛైర్మన్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి ఆయన విచ్చేశారు. బుధవారం రాత్రి ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంతంత లబ్ధిని పొందారో వివరించారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ముందుగా ఎంపీపీ ఏచూరి సునీతాసాయిశంకర్, సర్పంచ్ తోటకూర వెంకటనరసమ్మ నాగేశ్వరావు, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, ఉప సర్పంచ్ గొంది నాసరయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డికి ఘన స్వాగతం పలికారు. తొలుత అయ్యప్పస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం పెద్దబాయి, కేశంశెట్టి అంజయ్య, జాస్తి రామూర్తి, కొల్లి హనుమయ్య, కట్టెబోయిన రవి, పులిమెల ప్రసాద్, పేర్ల వెంకటేశ్వర్లు, మారుతీ, కటకం చినవెంకటయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

12న మెగా జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-వినుకొండ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల రెండవ శనివారం నాడు 12వ తేదిన వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఏ.తౌషిద్ హుస్సేన్ బుధవారం తెలిపారు. ఈ మెగా జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని సివిల్ కేసులు క్రిమినల్ కేసులు మనోవర్తి వివాదాలు వివాహ సంబంధ వివాదాలు బ్యాంకు వివాదాలు, ప్రీ లిటిగేషన్ వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకొని సమయం కాలయాపన కాకుండా ఖర్చుల భారం లేకుండా ఇరు వర్గాల వారు రాజీ మార్గంలో పరిష్కరించుకొని సుఖశాంతులతో జీవించాలని న్యాయమూర్తి కోరారు. ఎవరైనా కేసులు రాజీపడదగిన వ్యక్తులు ఉంటే నేరుగా మండల న్యాయ సేవాధికార సంస్థ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ భవనంలో నేరుగా సంప్రదించవచ్చునని న్యాయమూర్తి తెలిపారు.

సాగర్ బాబును పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మల్లాది గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బందెల సాగర్ బాబు రోడ్డు ప్రమాదానికి గురై అమరావతి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం స్థానిక శాసనసభ్యులు నంబూర శంకరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాగర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్నాటి ఉత్సవాల గోడ ప్రతులు ఆవిష్కరణ

విశాలాంధ్ర - కారెంపూడి : పల్నాటి ఉత్సవాల గోడప్రతులను మాచెర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వీరుల దేవాలయ పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ పౌరుషానికి ప్రతీక పల్నాటి ఉత్సవాలని,పల్నాటి చరిత్రకు ఎంతో విశిష్టత ఉందన్నారు. వీరులను స్మరించుకుంటూ చేపట్టే ఉత్సవాలు ప్రపంచంలో రోమ్ దేశంలో జరుగుతాయని ఆ తరువాత భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ లో గల పల్నాడు జిల్లా కారంపూడిలో మాత్రమే జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలు ప్రతి యేటా కార్తీక అమావాస్య నుండి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆయన తెలిపారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు 5 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి షేక్ షఫీ, బి విజయ్ కుమార్, కారంపూడి జడ్పీటీసీ షేక్. షఫీ, ఆచారవంతులు పాల్గొన్నారు.

హరగోవింద్ ఖోరానాకు నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మునుగోడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు హరగోవింద్ ఖోరానా వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఖోరానా పరిశోధనలు ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవము తీసుకొచ్చిందని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. వంశపారంపర్యంగా సంక్రమించే జీవనిర్మాణానికి దోహదం చేసే 'కృతిమ జీన్'ను సృష్టించిన ఆవిష్కరణ జెనెటిక్ ఇంజనీరింగ్ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి హరగోవింద్ ఖోరానా నాందిపలికారని జీవశాస్త్ర ఉపాధ్యాయులు డి.పద్మావతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చిన విజయ భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ యోగి వేమా రెడ్డి సేవ సమితికి వేమన విగ్రహం ఇచ్చేందుకు నరసరావుపేటకు చెందిన పడిగపటి విజయ భాస్కర్ రెడ్డి ముందుకు రావడం పట్ల వినుకొండ యోగి వేమా రెడ్డి సమితి అధ్యక్షులు ఆరే శివారెడ్డి సమితి తరుపున ధన్యవాదాలు తెలిపారు.వినుకొండ యోగి వేమా రెడ్డి సేవా సమితి కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది.

పంచదార, కందిపప్పు నిలుపుదల దారుణం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కార్డుదారులకు పంచదార, కందిపప్పు లాంటి నిత్యావసర సరుకుల పంపిణీ నిలిపివేయడం దారుణమని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గసభ్యుడు నరిశెట్టి వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వ చౌకదుకాణాలలో ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, పేద, మధ్యతరగతి ప్రజలకు నిత్యావసరాలైన పంచదార, కందిపప్పు పంపిణీ నిలిపివేశారన్నారు. పేదల సంక్షేమం కోసం అదనంగా ఏమీ ఇవ్వలేకపోయినా ఉన్నవాటిపై కోతలు విధించడం పట్ల సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గసభ్యుడు నరిశెటి వేణుగోపాల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పంచదార, కందిపప్పులతో పాటు గతంలో ఇచ్చిన మాదిరిగా చౌక డిపోల ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులు అందించేలా పౌరసరఫరాల శాఖ తగుచర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే నిత్యావసర సరుకుల పంపిణీ పునరుద్ధరణకు తగుచర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

వాహనాల పన్నులను సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : రవాణా వాహనాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించా లని పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి టీకే పరంధామ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ వాహన యజమానులు త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించని ఎడల ఆ వాహనాలకు 200 శాతం అపరాధ రుసుం వసూలు చేస్తామని అన్నారు. వాహనాలకు, డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన అన్ని సేవలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని వాహన యజమానులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత, స్లాట్ బుకింగ్ అవుతుందని ఆ సమయానికి అధికారులు సంబంధిత సేవలను పూర్తి చేస్తారని అన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల వాహన చోధకులు అప్రమత్తంగా ఉండాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు సీటు బెల్టు ధరించాలని, మైనర్లకు ఎలాంటి వాహనాలను ఇవ్వద్దని డీటీఓ పరంధామ రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. రవాణా శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తమ కార్యాలయంలో అధికారులు సంప్రదించాలని అన్నారు.

డీఎం పక్షపాత వైఖరి విడనాడాలి

విశాలాంధ్ర-వినుకొండ : ఏపీఎస్ఆర్టీసీ వినుకొండ డిపోలో డిపో మేనేజర్ అవలంబిస్తున్న యూనియన్ పక్షపాత వైఖరి, నిరంకుశ ధోరణి, అక్రమ పనిష్మెంట్లకు వ్యతిరేకంగా ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎస్ రావు అధ్యక్షత వహించగా డిపో అధ్యక్షులు డీజీ విన్సెంట్ మాట్లాడుతూ డీఎం అవలంబిస్తున్న నిరంకుశ చర్యలు, అక్రమ పనిష్మెంట్లు, యూనియన్ పక్షపాత వైఖరి మార్చుకోని కారణంగా గత రెండు రోజులుగా ఎర్ర బాడ్జెస్ ద్వారా, గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలియపరచామన్నారు. వారిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్కే ఖాజా, కె.హరిబాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఎన్ రెడ్డి, సీవీజీ రెడ్డి, గణపవరం శీను, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులను పరిశీలించిన ఆడిట్ బృందం

భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న స్టేట్ ఆడిట్ అధికారులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలకేంద్రమైన భట్టిప్రోలు మేజర్ పంచాయతీలో స్టేట్ ఆడిట్ బృందం సభ్యులు 2021- 2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. అసిస్టెంట్ ఆడిట్ అధికారిణి పి. రాజ్యం పర్యవేక్షణలో అధికా రులు మస్తాన్‌వలి, కుమార్ రాజా బృందం రికార్డులను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వం అందించిన నిధులు చేపట్టిన పనులు, ఖర్చులపై వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రతి ఏటా నిర్వహించే సోషల్ అడిట్‌లో భాగంగా పంచాయతీలో ఆడిట్ నిర్వహిస్తున్నామని ఆడిట్ పారదర్శకంగా జరుగుతుందని నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

13న ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మండల కేంద్రమైన భట్టిప్రోలులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు జొన్నకూటి ధర్మారావు బుధవారం తెలిపారు. స్థానిక రదం సెంటరులోని వేణుగోపాలస్వామి దేవస్థానంలోని సాయికృష్ణ కళ్యాణ వేదిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధుల నిపుణులు కె.వి. నరేంద్ర, ప్రభుత్వ వైద్యులు సివిల్ సర్జన్ ఆకురాతి శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణులు కె. సాయికృష్ణ, మంగళగిరి ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణులు వి. వింధ్య తదితర వైద్యుల బృందం పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి పరిసర గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ధర్మారావు కోరారు. అదే విదంగా భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్తీక వన సమారాధనను స్థానిక వెల్లటూరు రోడ్డులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

మీ దీవెనలతో తుది శ్వాస వరకు ప్రజాక్షేత్రంలో

- ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - కర్లపాలెం : మీ దీవెనలు నాకు ఉంటే నా తుది శ్వాస వరకు ప్రజా క్షేత్రంలో ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం పాటు పడతానని రాష్ట్ర శాసనసభ మాజీ ఉపసభాపతి స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని యాజలి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చారు. గత మూడేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రతి ఇంటికి తిరిగి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రజల అభ్యున్నతి కోసం నాపై ఎన్ని ఆరోపణలు నిందలు వేసిన భరిస్తానని మీ మంచి మనస్సుతో నన్ను ఆదరిస్తే మెండుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజల దీవెనలు ఉన్నంత కాలం నాపై జరిగే రాజకీయ కుట్రలు ప్రజలే తిప్పికొడతారని తెలిపారు. గత 30 ఏళ్లగా మీలో కుటుంబ సభ్యునిగా నన్ను ఆదరిస్తున్నందుకు మీ రుణం తీర్చుకుం టున్నాని తెలిపారు. రాబోవు రోజుల్లో మరింతగా బాపట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాదేండ్ల భానుప్రసాద్, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వినర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, పందర బోయిన సుబ్బారావు, మందపాటి పరమానందకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పేరాల వెంకట సురేష్, తాండ్ర సాంబశివరావు, తాండ్ర శ్రీధర్, మార్పు బెనర్జీ, చిక్కాల సాగర్, దొంతిబోయిన జయభరత్‌రెడ్డి, అట్ల నాగిరెడ్డి తదితరులున్నారు.

వనరులు ఉన్నా వెనకడుగు వేస్తే ఎలా..

- కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర - బాపట్ల : గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం వనరులు కల్పిస్తున్నా వెనకడుగు వేస్తే ఎలా అంటూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేట, ములపాలెం జగనన్న లేఅవుట్లను జిల్లా కలెక్టరు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. అర్ధాంతరంగా నిలిచిన గృహాల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణాలు మొదలుకాకపోవడంపై అధికారులు, సచివాలయాల సిబ్బందిని నిలదీశారు. గృహనిర్మాణాలకు అవసరమైన నిధులు, సామగ్రి, రుణసదుపాయం కల్పిస్తున్నప్పటికి లబ్దిదారులు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. జగనన్న కాలనీలలోని పక్కా గృహాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెలవారిగా జీతాలు తీసుకుంటున్నందుకైనా ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని హెచ్చరించారు. 20నెలల క్రితం ప్లాట్లు పంపిణీ చేసి ఇసుక, ఇనుము, సిమెంటు వంటి సామగ్రి, నీరు, విద్యుత్, రహదారులు ఏర్పాటు చేసినప్పటికి నిర్మాణాలలో పురోగతి లేకపోవడం ఏమిటని నిలదీశారు. సచివాలయాల సిబ్బందిపై ఉంచిన నమ్మకాన్ని పోగట్టరాదని ఆమె సూచించారు. చిత్తశుద్ధితో పనిచేయాలని, పక్కాగృహాల నిర్మాణంపై విస్తృత స్థాయిలో లబ్దిదారులను చైతన్యపరచాలన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా పనిచేయాలని, జిల్లా పురోభివృద్ధికి సహకరించాలని ఆమె తెలిపారు. ఆమె వెంట గృహనిర్మాణ శాఖ పి.డి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, మెప్మా పి.డి టి.రవికుమార్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 21 రద్దు చేయాలని నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర - కర్లపాలెం : ఆటో మోటారు వాహనాలపై భారీగా జరిమా నాలు విదించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెం 21ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద దర్నా చేయనున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. కర్లపాలెంలో నిర్వహించిన విలేకర్ల సామావేశంలో మాట్లాడుతూ ఏపీ వర్కర్స్ ఆటో యూనియన్ ఏఐటీయూసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దర్నాకు పిలుపినిచ్చినట్లు తెలిపారు. ఆటో మోటారు వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఈ- చెలాన్లు రద్దు చేయాలన్నారు. ప్రమాదకరంగా గుంతలు లేకుండా రోడ్లు వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. డీజల్, పంటగ్యాస్, విద్యుత్, ఇంటిపన్ను, చెత పన్నులను రద్దు చేసి కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. ఆట్, మోటార్ వాహనాలపై పెంచిన గ్రీన్ ట్యాక్స్ రోడ్ ట్యాక్, టోల్‌ప్లాజా ఫీజులు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, కార్యదరులు సన్నమూరి శ్రీనివాస రావు, మామిడి బత్తుల అశోక్, ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు షేక్ షబ్బీర్, డి.గోపి. షేక్ రఫీ, షేక్ ఖాజా, మణికంఠ, షేక్ సుభానీ, పి.అంజి, డి. సంజయ్, కె.సుబ్బారావు తదితరులున్నారు.

పుట్టగొడుగుల్లా ప్రయివేటు ఆసుపత్రులు

- అధికారపార్టీ ప్రజాపతినిధులతో ప్రారంభించటమే అనుమతులు
- ధనార్జనే ధ్యేయంగా రోగుల నుంచి నిలువు దోపిడీ
- వైద్యారోగ్యశాఖ దృష్టి పెట్టేనా..
- కలెక్టర్ చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ప్రవేటు ఆసుపత్రులు వారానికోకటి పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినధులచే ప్రారంభించుకుంటే చాలు మనకు అన్నీ అనుమతులు ఉన్నట్లే అనే ధీమాతో అడ్డదిడ్డంగా ప్రవేటు ఆసుపత్రు లు వెలుస్తున్నాయి. పూర్తిస్థాయి అనుమతులు లేకున్నా ధనార్జనే ధ్యేయంగా రోగులను నిలువ దోపిడే లక్ష్యంగా ఆసుపత్రి నిర్వాహకులు బరితెగిస్తున్నారు. బాపట్ల జిల్లా కేంద్రం అయిన ప్పటి నుంచి బాపట్ల పట్టణంతో పాటు పక్కనే ఉన్న కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు, చీరాలలో విచ్చలవిడిగా ప్రవేటు ఆసుపత్రులు గొందుల్లో సందుల్లో ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేటు ఆసుపత్రి పెట్టేందుకు ఆ ఏరియాలో ఉండే ఆర్ఎంపిలను బాగా మచ్చిక చేసుకుంటున్నారు. ఆర్ఎంపిలుకు ఎప్పటికికప్పుడు పర్సెంటేజీలు ఇస్తామని ఆశ చూపుతూ విందులు, వినోదాలు ఏర్పాటు చేసి కాకా పడుతున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు కేవలం ఆర్ఎంపి వైద్యుల పైననే ఆదారపడి నడుస్తున్నా యనటంతో ఎటువంటి సందేహం లేదు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వాహకులు ఆర్ఎంపి డాక్టర్లకు 25 నుంచి 30 శాతం పర్సెంటేజీలు అందించటంతో ఆర్ఎంపిలు కమీషన్‌ల కోసం కక్కుర్తి పడి గ్రామీణ ప్రాంతాల నుండి రోగులను పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో అవసరం లేకున్నా అడ్డమైన వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు రాస్తూ అడ్డగోలు బిల్లులు వసూలు చేస్తున్నారు. పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి రోగులను ఆకట్టుకుంటున్నారు. తూతూ మంత్రంగా అనుమతులతో ఇష్టా రాజ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులు ఎంతో నమ్మకంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే వారి జబ్బు నయం కాకముందే మరింత ప్రమాదం పొంచి ఉందని లక్షలాది రూపాయల బిల్లులు వసూలు చేస్తున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

- ప్రతి ఆసుపత్రికి వైద్య ఆరోగ్య శాఖ నుంచి తప్పని సరిగా అనుమతి పొందాలి. చిన్నపాటి క్లినిక్ ఏర్పాటు చేసుకున్న నిబంధనలు తప్పక పాటించాలి. కాలుష్య నియంత్రణ మండలి బయోవెస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు పొంది ఉండాలి. భవనంలో సరిపడా గాలి వెలుతురూ వచ్చేలా ఉండాలి. భవనంలో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలి. రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించటంతో పాటు ప్రతి ఐదేళ్లకోకసారి ఆసుపత్రి నిర్వహణ, ఇతర వైద్య సేవలు పునరుద్ధరణకు అనుమతులు పొందాలి. ఫీజులు, సేవలు, వైద్య సిబ్బంది వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి.
- నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ప్రవేటు ఆసుపత్రులపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి పెట్టి అకస్మిక తనిఖీ చేయల్సిన అవశ్యకత ఎంతైన ఉంది. అనుమతులు పాటించని ప్రవేటు ఆసుపత్రులపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటేనే ప్రజలు దోపిడికి గురికాకుండా ఉండే అవకాశం ఉంది. అదేవిధంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేక చొరవ చూపకపోతే రోగులను జలగల్లా పీల్చిపిప్పి చేసేందుకు మెడికల్ మాఫియాగా జిల్లా పేరు గావించే పరిస్థితి ఏర్పడుతుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి ఒక్కరికీ దైవభక్తి ఉండాలి

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : ప్రతి ఒక్కరు దైవం పట్ల భక్తి కలిగి ఉండాలని బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.బుధవారం మండల పరిధిలోని భవనంవారి పాలెంలో మోదుగుల శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద, గోకరాజువారి పాలెం కృష్ణుడు గుడి వద్ద ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక దైవ చింతనతో మనసు ప్రశాతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నాజర్ ఖాన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం ఎంపీటీసీ సభ్యులు పఠాన్ నాజర్ ఖాన్ జన్మదిన వేడుక లను బుధవారం సాయంత్రం నిజాంపట్నంలోని అయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరినాథ్ బాబు, జెడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య లు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటి జన్మదిన వేడుకలను జీవితంలో మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, ముస్లిం యూత్ తదితరులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఏర్పాటు చేసిన కేక్ ను నాజర్ ఖాన్ కట్ చేశారు.తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

మహారాజశ్రీ గురజాల 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
D.O.P: 632/2022
పిటీషన్ :
గోళ్ళపల్లి కోటేశ్వరమ్మ @ ముద్దా కోటేశ్వరమ్మ - పిటీషనరు
మరియు
గోళ్ళపల్లి యెహోషువా - రెస్పాండెంటు
గోళ్ళపల్లి యెహోషువా తండ్రి చిన్న డోర్ నెం : 2-91, ఎస్.సీ.కాలనీ గణపవరము (po) నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
పై నెంబరు D.O.P పిటిషన్‌ను పిటీషనరు, రెస్పాండెంటుపై దాఖలు చేసి యున్నది. సదరు పిటిషన్‌లో కోర్టువారు రెస్పాండెంటునకు నోటీసులు పంపుటకు ఆర్డరు వేసినారు. సదరు వాయిదా దీ.21-11-2022 వ తేదినకు అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10.30ని॥లకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసి యున్నది. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.
కందిమళ్ళ సూర్యరాజు, అడ్వకేట్
గురజాల మండలం, పల్నాడు జిల్లా
సెల్ : 9849738323

దీక్షాపరులకు అన్నదానం

విశాలాంధ్ర-గుంటూరు : దీక్ష స్వీకరించిన స్వాములకు స్థానిక నెహ్రూ నగర్‌లోని కోదండ రామాలయం లో వేద సీడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చద్ది కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ప్రారంభించారు. తొలుత తులసి ధర్మచరణ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహా నైవేద్యం సమర్పించి దీక్ష స్వీకరించిన స్వాములకు చద్దిని వడ్డించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం మహా పుణ్యమని, మాల ధరించిన వారికి అన్నదానం చేయటం మహాభాగ్యమన్నారు. నగరంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలకు దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ప్రతిఒక్కరు ఈ కార్యక్రమాలను మహా యజ్ఞంలా భావించి అన్ని చోట్ల విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ కుల, మత రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. అన్నదాన కార్యక్రమాలలో స్థానిక యువత ప్రధాన పాత్ర పోషించి.. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండి విజయవంతంగా నడిపించాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఆళ్ల శ్రీను స్వామి నెహ్రూనగర్‌లో పూజా, సేవా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, వేద సీడ్స్ సిబ్బంది తోట రంగారావు, నీలం శివరామకృష్ణ, ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం, తేలప్రోలు వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ళ శ్రీనివాసరావు, అయిశెట్టి శ్రీనివాసరావు, బండి రామ ప్రభు, చెన్ను అశోక్, యర్రగోపు నాగేశ్వరరావు, పుల్లగుర చంద్రశేఖర్, కదరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగార్చన

విశాలాంధ్ర - భట్టిప్రోలు : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కార్తీక మాస పూజల్లో భాగంగా బుధవారం రాత్రి జ్యోతిర్లింగార్చన, జ్వాలాతోరణంలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాళ్ళం అశ్విన్ - జ్యోతి స్రవంతి, బొలిశెట్టి తిరుమల శ్రీనివాసరావు - కిరణ్మయి, బొలిశెట్టి సునీల్ - శ్రీలక్ష్మీ, బుర్లె విజయ్‌కుమార్ - రోజారాణి, ఆత్మూరి వాలేశ్వరరావు - భవానీ దంపతులతో జ్యతిర్లింగార్చనను దేవాలయ ప్రధాన అర్చకులు శాస్త్రయుక్తంగా జరిపించారు. జ్యోతిర్లింగార్చన అనంతరం దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలతో జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థానం అభివృద్ధి కమిటి అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా, మహిళా కమిటి సభ్యులు పర్యవేక్షణ గావించారు.

ఆర్బీకేలకు కంప్యూటర్ ఉపకరణాలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలని మండల ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు సూచించారు.మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు ఇటీవల కేటాయించిన కంప్యూటర్ ఉపకరణాలు (ప్రింటర్, యూపీఎస్) లను బుధవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వారు గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, రైతాంగానికి మెరుగైన సత్వర సేవలను అందించడానికి ఇవి ఉపయుక్తంగా ఉంటాయని, గ్రామ వ్యవసాయ సహాయకులందరు నైపుణ్యం పెంచుకునేందుకు దోహదపడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామ సర్పంచులు, వ్యవసాయ సాంకేతిక సలహా మండలి సభ్యులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, 12 రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ఏఈవోలు, ఎంపిఈఓలు పాల్గొన్నారు.

అల్లు వెంకట రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లు వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. విజయపురిసౌత్ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. బుధవారం ఎమ్మెల్యే పీఆర్కే వెంకటరెడ్డి స్వగృహంలో జరిగిన సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెంకటరెడ్డి పార్టీ క్రియాశీలక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడని ఆయన మృతి ఎంతో బాధకరమన్నారు. వెంకటరెడ్డి కుటుంబానికి అండగా ఉండి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీనిచ్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, బూడిద శ్రీను, పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, శేరెడ్డి వీరారెడ్డి, సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, మాచర్ల జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పెరుమాళ్ళ వెంకట్రామయ్య, సాగర్ ప్రాజెక్టు డీఈ వెంకటసుబ్బయ్య, జేఈలు బాబుమియా, కోటేశ్వరరావు, శివరామిరెడ్డి, తంగిరాల రామిరెడ్డి, ఊరే మార్కు, జోసేఫ్ బాబు, సంతవరపు లక్ష్మీనారాయణ, కారే మునలయ్య, ఎస్కే మస్తాన్, పూరి, అప్పలస్వామి, మట్టపల్లి బ్రహ్మం, మురళి, గాంగు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

విశాలాంధ్ర-శావల్యాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఆధునిక పద్ధతుల ద్వారా చేతివృత్తులలో శిక్షణనిచ్చి శాశ్వత ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా నాబార్డు సంస్థ కృషి చేస్తుందని ఎంపీడీవో పేరుమీన శీతారామయ్య అన్నారు. నాబార్డు సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 30 మంది డ్వాక్రా మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారిపై శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారని, నైపుణ్యాలను పెంచుకుని ఆత్మవిశ్వాసంతో ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. నేచురల్ హెల్త్ కేర్ టీం లీడర్ భగవాన్ దాస్ మాట్లాడుతూ 20 రోజుల ఉచిత శిక్షణలో మహిళలు వృత్తిపరమైన నైపుణ్యాలను తెలుసుకోవడానికి విశేష కృషి చేయాలని కోరారు. అనంతరం మే నెలలో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, ఏపీఓ రాజు, సీసీ బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

తమాషాలు చేస్తూ.. కట్టు కథలు చెపితే ఉద్యోగాలు ఉండవ్

- కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర-బాపట్ల : గ్రామ సంఘాల వ్యవస్థను బలోపేతం చేయకుండా తమాషాలు చేస్తూ కట్టు కథలు చెపితే ఉద్యోగాలు ఉండవ్ అని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఘాటుగా మందలించారు. డీఆర్డీఏ, ఏపైకేపీ అధికారులతో బుధవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల పొదుపు మహిళల ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత కల్పించి సంఘాల పురోభివృద్ధికి అధికారులు తోడ్పాటునందించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామసంఘాలు, స్వయం సహాయక సంఘాల పుస్తక నిర్వహణ సరిగా లేదన్నారు. ఉన్నతి పథకం ద్వారా నిరుపేద ఎస్సీ,ఎస్టీ మహిళల అభ్యున్నతికి మీ వంతు కృషిచేసి రుణసదుపాయం జీవనోపాధిని పెంచేలా ఉండాలన్నారు. అదేక్రమంలో రుణాల తిరిగి చెల్లింపులు సకాలంలో ఉండాలన్నారు. అద్దంకి మండలంలో ఒక కోటి రూపాయల మొండి బకాయిలు ఉండడంపై ఆరా తీశారు. అలాగే జె.పంగులూరు మండలంలో రూ.1.59 కోట్లు, కొరిశపాడులో రూ.64.89 లక్షలు, వేటపాలెంలో రూ.26.41 లక్షలు, సంతమాగులూరు రూ.47.7 లక్షల బకాయిలు ఉండడం ఏమిటని ప్రశ్నించారు. బకాయిలు పెరిగిపోతున్న పట్టించుకోవడం లేదని, సిబ్బంది పనితీరు బాగోలేదన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ లేక సంఘాలు పురోభివృద్ధిలో పయనించలేక పోతున్నాయన్నారు. మీ చేతగానితనంతో వ్యవస్థను నాశనం చేయవద్దని ఘాటుగా మందలించారు. ఆర్.ఆర్ చట్టం కింద సి.ఐ.ఎఫ్ నగదు వసూలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో 33,546 స్వయం సహాయక సంఘాలు ఉంటే అందులో 3,40,428 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. పొదుపు మహిళల జీవనోపాధుల వృద్ధికి అధికారులు సహకరించాలన్నారు. సంఘాల ఆర్థికాభివృద్ధికి పంపిణీ చేసిన సామాజికి పెట్టుబడి నిధి అమలుపై పర్యవేక్షణ ఉండాలన్నారు. రికవరి చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. చిన్నగంజాం మండలంలో రూ.33.68 లక్షలు బకాయిలు ఉండగా వాటికి వడ్డీ సొమ్ము రూ.9.71 లక్షలకు చేరిందన్నారు. బాపట్లలో రూ.11.52 లక్షల బకాయిలు ఉండగా వివిధ మండలాలలో లక్షల రూపాయలమేర బకాయిలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సొమ్ము ప్రతి రూపాయి తిరిగి చెల్లించాల్సి ఉందని ఆమె స్పష్టం చేశారు. కొంతమంది అధికారుల వద్ద సమగ్రమైన నివేదికలు లేకపోవడంపై ఆమె మండిపడ్డారు. మహిళల ఎదుగుదలకు క్షేత్రస్థాయిలోని అధికారులు అడ్డంకిగా ఉండరాదని కలెక్టరు చెప్పారు. ఏపీఎంలు,సీసీలు తప్పు చేస్తే సస్పెండ్ చేస్తామని ఆమె తెలిపారు. పొదుపు సంఘాలలోని 20,902 మంది మహిళలకు పక్కా గృహాలు నిర్మించుకోడానికి రుణాలు అందించగా 1,635 మందికి రుణం ఇవ్వకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు రుణసదుపాయం కల్పించాలన్నారు. జగనన్నతోడు పెండింగ్ రుణాలను లబ్దిదారులకు పంపిణీ చేయాలన్నారు. నాటుసారా కాస్తూ పట్టుబడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆదేశించారు. మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకోసం మహిళా సంఘాలను ఆన్‌లైన్ లో నిక్షిప్తం చేయాలన్నారు. తద్వారా ప్రజలకు చౌకగా వస్తువులు అందుతాయని ఆమె వివరించారు. వై.యస్.ఆర్ పింఛన్ కానుక పంపిణీలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయన్నారు. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి అదనంగా యంత్రాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ పి.డి బి.అర్జున్ రావు, డి.పి.ఎమ్ లు యు. సుబ్బారావు, సుబ్బాచారి, ఒంగోలు సుధాకర్, కె.రవికుమార్, హర్షవర్ధన్, ప్రమీలా కుమారి, ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏ.పి.ఎమ్ లు, పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-శావల్యాపురం : గ్రామాలలోని వినియోగదారులు విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని విద్యుత్తు శాఖ ఈఈ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని 15 గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా 2500 మీటర్లను పరిశీలించి తనిఖీ చేసి 55 మందిపై రూ.1.73 లక్షలు అపరాధ రుసుం విధించామని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కనెక్షన్లు వెంటనే మంజూరు చేస్తామని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు మాత్రమే ఉచ్చితమని ఎక్కువ యూనిట్లు వాడినట్లయితే బిల్లు చెల్లించాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నామని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామాగ్రి కొరత లేదని, విద్యుత్ లైన్ల మరమ్మత్తులను గుర్తించి వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలు ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలి కాని స్వంతగా చేసుకోరాదని, సిబ్బంది స్పందించని ఎడల 1912 నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. త్వరలో ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లను కూడా అందుబాటులోకి వస్తాయని, విద్యుత్ బిల్లులను గ్రామ సచివాలయాలు, ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. మండలంలో విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, బకాయిలు చెల్లించనివారి ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తామని అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వేంకటేశ్వర రెడ్డి, కిరణ్ బాబు, ఏడుకొండలు, ఏఈ సంపెంగల గాంధీ బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఏడుకొండలు, శివకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ రాకను అడ్డుకుంటాం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : భారత ప్రధాని రాక ఏపీ ప్రజలలో గుబులను పుట్టిస్తుందని బాపట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంట అంజిబాబు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రజలు 10 సంవత్సరాలు పార్టీకి పునాదులు లేకుండానే చేశారు. కానీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిసారి ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహాయాన్ని సహకారాన్ని ఇప్పుడు అందిస్తానని హామీలు ఇవ్వడమే తప్ప ఏ రోజు కూడా ఒక్క హామీని నెరవేర్చిన దాఖలాలు లేవని అన్నారు. విశాఖపట్నం రాకతో విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేసే కుయుక్తి ఏదో జరగబోతుందని, అడ్డుకునేందుకు కార్మిక సోదరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మోదీ రాక నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే విధంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని పిలుపునిచ్చారు. అలాగే జోడో పాదయాత్రను విజయవంతం చేసినటువంటి ఏపీ ప్రజలకు బాపట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొంతకాలంగా బాపట్ల పట్టణంలోని గరుడ చలం నాయుడు ఆస్తులపై జరుగుతున్నటువంటి వివాదంపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు గంట అంజిబాబు విమర్శలను గుప్పించారు. గరుడ చలం నాయుడు ఆస్తులపై కాంగ్రెస్ పార్టీ ఎంతోకాలంగా పోరాటం చేస్తుందని దాన్ని తీవ్రతరం చేసి ప్రభుత్వాస్తులను కాపాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధోనిపూడి దేవరాజ్, పఠాన్ రాజేష్, సేలం సాగర్, అరుణ, రవిబాబు, లాజర్, ఐజాక్, ఎస్వీఆర్ కుమార్, బక్క రోశయ్య పాల్గొన్నారు.

మల్లాదిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



విశాలాంధ్ర- అమరావతి : మండలంలోని మల్లాదిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సాగిం ది. ప్రతి ఇంటా సంక్షేమ సిరులు పొంగడంతో ఎమ్మెల్యే నంబూరు శంకర్రావుకు గడప గడపలో అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గడప గడపకు వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ సాయం, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. పూర్తి వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. మల్లాది ఎస్సీ కాలనీతో పాటు మల్లాది సచివాలయ పరిధిలోని పొందుగుల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. అన్ని పథకాలు అందుతున్నాయా... వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయి... గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల తీరు ఎలా ఉంది అని ప్రత్యేకంగా మహిళలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పౌరులందరికీ అందుబాటులో న్యాయ సేవలు

విశాలాంధ్ర-తెనాలి : దేశంలో పౌరులందరికి న్యాయ సేవలు అందుబాటులో ఉన్నామని 11వ అడిషనల్ జడ్జి జి.మాలతి అన్నారు. నవంబర్ 11న జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ తెనాలి సమావేశంలో మాట్లాడుతూ 1995 నవంబర్ 11న జాతీయ న్యాయ దినోత్సవం ఆచరిస్తున్నామన్నారు. పంతాలకు పోకుండా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకుని సమాజంలో ప్రశాంత జీవనం గడపాలన్నదే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. నవంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో గతంలోలా సాధ్యమైనంత ఎక్కువ కేసులు రాజీపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు టి.రామచంద్రుడు, కె.వాణి, షరీఫ్, రహంతుల్లా, శ్రీసీత, బార్ కౌన్సిల్ అధ్యక్షులు యం.వేణుగోపాలరావు, గౌరీశంకర్, న్యాయవాదులు పారాలీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది మెహబూబ్‌లు పాల్గొన్నారు. శ్రీనివాసరావు, జగజ్జీవన్ పట్టణ స్టేషన్ ఆఫీసర్లు కె.బి.కోటేశ్వరరావు, యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

-అడిషనల్ జిల్లా జడ్జి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నర్సరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరావు అన్నారు. నర్సరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరుజిల్లా మండల కేంద్రమైన ఫిరంగిపురం గ్రామ పంచాయతీ ఆడిటోరియంలో మండల ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా పాల్గొన్న అడిషనల్ జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి ఉచితంగా న్యా య సలహాలపై అవగాహన కల్పించడమే ఈ న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సమాజంలో దేశంలో ప్రతి ఒక్కరు డా.బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి పౌర హక్కుల గురించి తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని, హక్కుల ఉల్లంఘన జరిగినపుడు న్యాయ స్థానాలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. చట్టం అందరికి సమానమేనని ఎవరికి చుట్టం కాదన్నారు. గౌరవ అతిధి నర్సరావుపేట 2వ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి జె.అంజయ్య మాట్లాడుతూ ఆస్తులు రాయించుకొని తల్లీదండ్రులను పట్టించుకోని కుమారులు, కుమార్తెలకు న్యాయ స్థానం ద్వారా ఉచితంగా న్యాయం పొందడానికి చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. వివిధ రకాల కేసులకు సంబంధించి కోర్టు ఫీజులు చెల్లించడానికి స్థోమత లేని వారికి ప్రత్యేక న్యాయ న్యాయవాదులు చే ఉచితంగా న్యాయం పొందడానికి కోర్టు అవకాశం కల్పిస్తుందని ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మనాభుడు, ఎంపిడివో దాసరి అనురాధ, యస్.ఐ. లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచ్ మేడా బాబు, నర్సరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలా హనుమంత్‌రెడ్డి, కోర్టుకు సంబంధించిన ప్రభుత్వ న్యాయవాదులు(పెనల్ అడ్వకేట్స్) కోచూరి రాధిక, టి.అమూల్య, యం. హరీష్‌కుమార్, పంచాయతీ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : గత కొన్ని రోజులుగా బాపట్ల పట్టణంలో విమర్శల నోప్పిస్తున్న గరుడ చలం నాయుడు ఆస్తులను మాజీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి ఆక్రమించాడని తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైసీపీ నాయకులు సరాలశెట్టి ప్రకాష్ రావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశము ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు మీద అవినీతి ఆరోపణలు చేసే ముందు తన పరిస్థితిని గుర్తించుకోవాలని సూచించారు. దళితుల భూములను ఆక్రమించడం దానిలో వాటర్ సముదాయాలను విక్రయించుకోవడం అవినీతి కాదా అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శాసనసభ్యులు కోనా రఘుపతి 74వ సంవత్సరంలో దేవదాయ శాఖ భూమి ఆర్టీసీకి కేటాయించిన సమయంలో ప్రభుత్వం ఆక్షన్ పద్ధతిలోనే పెట్రోల్ బంక్ కానీ, హోటల్ గాని నిర్మించారని, అవినీతికి పాల్పడే సంస్కృతి కోనా రఘుపతికి లేదని గుర్తుంచుకోవాలని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో జోగి రాజా, నారాయణరెడ్డి, వెనకలూరు మాల్యాద్రి, సైదుపీర్, శ్రీనివాసరావు, నక్క వెంకట్రావు, ఇనపగల రంగారావు, అదే చందు, అదే కేథరిన్ రాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దగా ప్రభుత్వాన్ని గద్దె దించాలి

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రాష్ట్రంలో అప్పనంగా దోచేస్తూ, కల్లుగీత కార్మికులపై సీత కన్ను వేసిన ఈ దగా ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు అందరం కలిసి పోరాడుదామని తెలుగుదేశం పార్టీ బాపట్ల ఇంచార్జ్ వేగేసన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నందిరాజ్ తోట గ్రామంలో గల అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ర్యాలీగా నందిరాజు తోట గ్రామాన్ని సందర్శించి ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్నటువంటి పన్నుల భారాన్ని, చేస్తున్న అవినీతిని బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా అందరికి తెలియపరుస్తున్నట్లు వేగేసిన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారి ప్రజలపై విపరీతమైన పన్నుల భారాన్ని మోపి చెత్త పాలన చేస్తూ చెత్తపై కూడా పన్ను వేస్తున్నారని విమర్శించారు. అలాగే కల్లుగీత కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక రూపాయి నిధి లేకుండా వారిని దగాపరచడం సిగ్గుచేటని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జయప్రకాష్ నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ముఖముల శివ, రమేష్ గౌడ్, కృష్ణ గౌడ్, చిన్న బాబు గౌడ్, మానం సుజాత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహనరావు దంపతులకు సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు : విజేత సూపర్ మార్కెట్ అధినేత మురికొండ జగన్‌మోహనరావు, వారి సతీమణి కృష్ణవేణిలు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా 2022 సంవత్సరానికి 'బిజినెస్ ఎక్సలెన్స్' అవార్డు ఇటీవల అందుకున్న సంగతి విధితమే. అవార్డు అందుకొని గుంటూరు వచ్చిన సందర్భంగా బుధవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో వారిని శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జగన్‌మోహనరావు, కృష్ణవేణిలను సన్మానించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్షం అని నమ్మి కష్టపడి ఇంత స్థాయికి ఎదిగి ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్న జగన్‌మోహనరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లయన్స్ జిల్లా ఇన్‌చార్జ్ గవర్నర్ పి.గోపిచంద్ మాట్లాడుతూ జగన్‌మోహనరావు చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సన్మాన కార్యక్రమంలో నూతలపాటి వీర ప్రకాశరావు, కె.విజయ్ చంద్, ఈదర వెంకటేశ్వర్లు, రామన శ్రీనివాసరావు, డాక్టర్ సాయి, డాక్టర్ చక్రపాణి, కొంజేటి వెంకట నగేష్, నిడమానూరి సురేష్, పరమహంస, కర్రా హానోక్ బెంజిమెన్ తదితరులు ఉన్నారు.

పురపాలక సంఘ ఉద్యోగుల కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలి పురపాలక సంఘ ఉద్యోగుల కార్తీక వనసమారాధన కార్యక్రమం బుధవారం సందడిగా జరిగింది. స్థానిక చినరావూరులోని సత్యనారాయణ స్వామి పార్కులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. ముందుగా పార్కు ఆవరణలోని ఉసిరి, తులసి చెట్టు, వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. పార్కు ఆవరణలోనే ఉద్యోగులు, కౌన్సిలర్లు, సిబ్బందితో కలసి ఎమ్మెల్యే కూడా వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం మంచి పరిణామమని అన్నారు. ఉద్యోగులంతా కలసి కట్టుగాపని చేసి తెనాలికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కమీషనర్ ఎం.జస్వంతరావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమీషనర్ యం.గోపాలరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, వివిధ వార్డులకు చెందిన వైసిపి, టిడిపి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ఎదుగుదలను ఓర్వలేక కుయుక్తులు

విశాలాంధ్ర-వేమూరు : నియోజకవర్గ కేంద్రమైన వేమూరు మండలంలో జనసేన పార్టీ అతి వేగంగా విస్తరిస్తుండటంతో అధికార పార్టీ ఓర్వలేకపోతున్నదని, రోజు రోజుకు పార్టీ ప్రజల్లోకి బలంగా వెళుతుండటంతో బెంబేలెత్తుతున్న అధికార పార్టీ నాయకులు, తమ పార్టీ నాయకులు మనో ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా తపుడు కేసులు బనాయిస్తున్నారని జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బోడియ్య అన్నారు. బుధవారం మండల గ్రామమైన చావలిలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో తమ పార్టీ మండల అధ్యక్షులు ఊసా రాజేష్ గత కొన్ని నెలలుగా గ్రామంలో నివసించటం లేదని, అయితే రాజేష్ మనో ధైర్యాన్ని ఎలాగైనా దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతో అధికార పార్టీకి చెందిన చెందిన కొందరు వ్యక్తులు సెబ్ అధికారులతో కుమ్మకై అనధికార బెల్ట్ షాపు నడిపిస్తున్నారంటూ రాజేష్ తండ్రిపై తపుడు కేసు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. సెబ్ అధికారులు విచారణ లేకుండా కేసు ఎట్టడమేమిటని ప్రశ్నించారు. రాజేష్ తండ్రి శబరిమలై వెళ్ళారని, గ్రామంలో లేని సమయం చూసి తన తండ్రికి చెందిన పాడుపడిన గృహంలో మద్యం సీసాలు ఉంచి ఆయనపై కేసు బనాయించటం సిగ్గుచేటన్నారు. సెబ్ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే అక్రమ రేషన్ బియ్యం రవాణా, ఇసుక, అక్రమ మట్టి త్రవ్వకాలను అరికట్టాలని కోరారు. ఎవరు ఎన్నికుయుక్తులు పన్నినా జనసేన పార్టీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు రాజేష్, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు యల్లమాటి రాజేంద్ర, కొల్లూరు, చుండూరు మండల పార్టీ అధ్యక్షులు చావలి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఈ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి'

విశాలాంధ్ర-పెదకాకాని : బాదుడే బాదుడు కార్యక్రమాన్ని బుధవారం పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు ప్రజలు, మహిళలు హారతులు ఇచ్చి ఈసారి మీరే రావాలి అంటూ ఆశీర్వదించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, భారీ పన్నులు, పెట్రోల్, డీజిల్ ధరలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించక పోవడం గురించి గ్రామములోని ఇంటి ఇంటికి వెళ్ళి కరపత్రాలు అందజేసి సామాన్యులు ఏవిధంగా నష్టపోతున్నారో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మండలంలో గత పదిహేను రోజులుగా బాదుడే బాదుడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను కూడా వేయడం జరిగిందని, గ్రామాలలో ప్రజల మీద ఈ ప్రభుత్వము విపరీతమైన భారం మోపిందని చెప్పారు. అధికారం కోసం ఎన్నో నాటకాలాడారని, మరెన్నో మాయమాటలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారని అన్నారు. పెదకాకాని మండలంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు గుంటూరు కార్పొరేషన్ నుంచి వేసిన మంచినీటి పైపులైనుకు ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చిన మూడున్నర సంవత్సరాలలో చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.